క్లుప్తంగా

ఒకటి నుంచి పవిత్రోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను సెప్టెంబర్ ఒకటి నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించనున్నామని ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

ఆదాయ పెంపునకు యాక్షన్ ప్లాన్

• ఎంపీడీఓ నరసింహారావు



మాట్లాడుతున్న అధికారులు

పొదలకూరు: గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు సర్పంచ్‌లు యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని ఎంపీడీఓ డీవీ నరసింహారావు అన్నారు. పంచాయతీ పురోగతి సూచికపై శుక్రవారం సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సెక్రటరీలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఒకరోజు వర్క్‌షాపును నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ మల్లికార్జున ఆర్పీగా వ్యవహరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు గ్రామ పంచాయతీలకు ఏ విధంగా నిధులు సమకూరుతాయో తెలుసుకోవాల్సిందిగా సూచించారు. పంచాయతీలు వెచ్చిస్తున్న నిధుల వివరాలతోపాటు నిధుల సమీకరణ గురించి తెలుసుకుంటే పాలన బాగుంటుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం చాలా రకాలుగా హక్కులను కల్పించడం జరిగిందన్నారు. సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో కనీస అవసరైన తాగునీరు, వీధిలైట్లు, పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేపట్టాల్సి ఉంటుందన్నారు. పంచాయతీలు కొన్ని రకాల పన్నులను విధించి ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు చట్టాలున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



ఇందుకూరుపేట: మాట్లాడుతున్న మురళి

కోవూరు: రైతులు తమ పంటను నమోదు చేసుకోవాలని కోవూరు వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత కోరారు. మండలంలోని పాటూరులో గల రైతు సేవా కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధి పొందని రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏఓ రజని తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: వరి పంటపై శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని జగదేవిపేటలో గల రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీడీ మురళి హాజరయ్యారు. వరిలో సమగ్ర సస్యరక్షణ, నారుమడి, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం తదితర అంశాలపై మండల వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతినే కొనసాగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు, కార్మికులు

ముత్తుకూరు(పొదలకూరు): వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో పాతపద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ శుక్రవారం ఆందోళన చేపట్టింది. మండలంలోని కప్పలదొరువు ఏటీఎస్ సెంటర్ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి ప్రణీత్ సెన్సార్ ప్రైవేట్ సెంటర్ వరకు రవాణా రంగ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఎఫ్‌సీలను ప్రైవేట్ ఏజెన్సీలు పంపిణీ చేసే విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ వెహికల్స్ రంగాన్ని నీరుగార్చే విధానానికి శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. ఆర్టీఓ కార్యాలయాన్ని కూడా నిర్వీర్యం చేసే ప్రక్రియలో భాగంగా చెప్పారు. ర్యాలీలో సుమారు 400 మంది కార్మికులు పాల్గొని నినాదాలు చేశారు. జిల్లా కార్యదర్శి కే.సురేష్ తదితరులు పాల్గొన్నారు.





కోలాహలంగా నిమజ్జనం

వినాయక చవితిని పురస్కరించుకొని తాత్కాలికంగా ప్రతిష్ఠించిన గణనాథుల విగ్రహాల నిమజ్జనాలు శుక్రవారం కొనసాగాయి. దీంతో రంగనాయకులపేటలోని పెన్నా బ్యారేజీ.. మూలాపేటలోని గణేశ్ ఘాట్ వద్ద కోలాహలం నెలకొంది. విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు పర్యవేక్షించారు.

– నెల్లూరు(బృందావనం)



రాజరాజేశ్వరి సన్నిధిలో పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల ఉద్యాపన పూజలను శుక్రవారం నిర్వహించారు. అమ్మవారికి చీర, జాకెట్టు, 108 నిమ్మకాయల మాలలను సమర్పించారు. సుమారు రెండు వేల మందికిపైగా భక్తులకు ప్రసాదాలను అందజేశారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకిసేవను నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి, ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఇమామ్‌లకు గౌరవ వేతనమివ్వాలని డిమాండ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేయాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లోని ఆవాజ్ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే మైనార్టీలకు సబ్సిడీ రుణాలు, 50 ఏళ్లకే పింఛన్లు, ఇమామ్, మౌజన్లకు ప్రతి నెలా గౌరవ వేతనాన్ని ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కూటమి పార్టీలు వీటిని అమలు చేయలేదని ఆరోపించారు. నేతలు



మాట్లాడుతున్న రషీద్

రియాజ్, అన్సర్, రవూఫ్, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌సీఓగా వెంకటేశ్వరరెడ్డి

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నెల్లూరు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్‌గా వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సుధాభారతి ఉద్యోగ విరమణ పొందడంతో ఒంగోలు డీసీఓ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన నియమితులయ్యారు. సహకార శాఖ రాయలసీమ జోనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గోగుల శ్రీనివాసులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.



ఘన సన్మానం

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో ఏఎస్‌ఎంగా పని చేస్తూ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి పొందిన విజయలక్ష్మిని రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్, అమరావతి ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. అనంతరం డిప్యూటీ హెచ్ఈఓగా ఉద్యోగోన్నతి పొందిన మైత్రి, లోకేశ్వరిదేవి, విజయలక్ష్మి తదితరులకు శుభాకాంక్షలను తెలియజేశారు. వనంతోపు సెంటర్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చేజర్ల సుధాకర్‌రావు, జిల్లా సెక్రటరీ బట్టేపాటి అశోక్, ఉపాధ్యక్షులు ఉమర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురం నుంచి జనార్దన్‌రెడ్డి కాలనీకి వెళ్లే ప్రధాన మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన స్తంభం వాలిపోయి ప్రమాదభరితంగా మారింది. ఏ క్షణంలోనైనా పడిపోయేందుకు సిద్ధంగా ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పెరుగు రామకృష్ణకు సాహిత్య పురస్కారం

నెల్లూరు(బృందావనం): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని 14 మందికి భాషా పురస్కారాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సృజనాత్మకత, సంస్కృతి సమితి శుక్రవారం ప్రకటించింది. నెల్లూరుకు చెందిన కవి పెరుగు రామకృష్ణ పురస్కారాన్ని అందుకోనున్నారు. రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసపత్రాన్ని త్వరలో అందజేయనున్నారు.

జగదేవిపేటలో వైద్య శిబిరం

ఇందుకూరుపేట: జగదేవిపేట పరిధిలోని డీఎం కండ్రికలో 104 వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించాలని సూచించారు. హెచ్‌ఐవీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గానూ శిబిరాలు, సదస్సులను నిర్వహించాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ కిశోర్ కుమార్, డిప్యూటీ హెచ్ఈఓ సుధాకర్‌రావు, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఏఎన్ఎం కల్పవల్లి, 104 సిబ్బంది లక్ష్మణ్, ఆశ వలంటీర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.



పీఏఐపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పంచాయతీ అడ్వాన్స్‌డ్ ఇండెక్స్ (పీఏఐ)పై అవగాహన సదస్సును స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నారాయణరెడ్డి మాట్లాడారు. పీఏఐను సక్రమంగా అమలు చేసిన గ్రామాలకు అదనపు నిధులను ప్రభుత్వం సమకూర్చనుందని చెప్పారు. కార్యక్రమాన్ని శ్రద్ధగా నిర్వహించాలని సూచించారు. ఎంఈఓ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోని సత్యసాయి సేవా ట్రస్ట్‌లో రోగులు, వారి సహాయకులు 300 మందికి అన్నదానాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అసోసియేషన్ సభ్యుడు డాక్టర్ దొరస్వామినాయుడి వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చింతల అమరేంద్రరెడ్డి, పొన్నం రవిచంద్ర, రాఘవేంద్రశెట్టి, గోపాల్‌రెడ్డి, జయదేవ్, సుబ్బరామిరెడ్డి, బెజవాడ సునీల్‌రెడ్డి, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

010 పద్దు కింద జీతాలివ్వాలి

నెల్లూరు రూరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లకు 010 పద్దు కింద జీతాలు, పింఛన్లను ఇవ్వాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు కోరారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గోవిందరెడ్డి, అధ్యక్షుడిగా రంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుభాష్‌చంద్రగుప్తా, వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనాథ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జయమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుధాకరాచారి, కోశాధికారిగా ఏడుకొండలు, సభ్యులుగా ఆదిలక్ష్మి, రాజు, రవీంద్రనాథ్‌రెడ్డి, ఫజుల్లా, రాష్ట్ర ప్రతినిధులుగా పెంచలయ్య, సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. త్రిమూర్తులు, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటైనర్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ పరిధిలో మొదటిసారిగా నగరంలో ఏర్పాటు చేయనున్న కంటైనర్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన శంకుస్థాపనను మంత్రి నారాయణ శనివారం చేపట్టనున్నారని ఎస్ఈ విజయన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద తక్కువ స్థలంలో దీన్ని ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు.

సాయిసచ్చరిత్ర శోభాయాత్ర రేపు

నెల్లూరు(బృందావనం): సాయిసచ్చరిత్ర శోభాయాత్రను ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు నిర్వహించనున్నామని బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిర కమిటీ చైర్మన్ మధుసాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిమాలధారణ మండల దీక్ష, షిర్డీ యాత్ర సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టనున్నామని వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

నెల్లూరు(పొగతోట): ఏఎంసీ చైర్మన్‌గా మనుబోలు శ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా చంద్రశేఖర్‌తో పాటు 13 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, టీడీపీ నేతలు విజయభాస్కర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జనసేన నేత చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులందరికీ పింఛన్లు ఇవ్వాలని వినతి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో అర్హులైన దివ్యాంగులందరికీ సెప్టెంబర్‌లో రూ.ఆరు వేల చొప్పున పింఛన్లు ఇవ్వాలని ప్రజాసత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు కోరారు. ఈ మేరకు డీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌కు వినతిపత్రాన్ని కలెక్టరేట్లో శుక్రవారం అందజేశారు. దయాకర్, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా లార్వా, ఫీవర్ సర్వేలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు గానూ లార్వా, ఫీవర్ సర్వేలను విస్తృతంగా చేపట్టాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. నగరంలోని రామచంద్రాపురం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర వ్యాధులను గుర్తించేందుకు రక్త పరీక్షలను నాణ్యవంతంగా చేయాలని సూచించారు. రక్త పరీక్షల వివరాలు, పాజిటివ్ కేసులపై ప్రతి బుధ, శనివారాల్లో నిర్వహించే యూపీహెచ్‌సీల సమీక్షల్లో తెలపాలన్నారు. అనంతరం ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా సహాయ నివారణాధికారి నాగార్జునరావు, పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్యామ్‌సన్, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న హుస్సేనమ్మ

భక్తిశ్రద్ధలతో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం): మూలాపేట బ్రాహ్మణవీధిలోని గురునిలయంలో అవధూత భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. వెంకయ్యస్వామి ప్రియ శిష్యుడు మాకాని వెంకట్రామ్‌కు అభిషేకాలు, పూజలు, హోమాలు, సహస్రనామార్చన, మహానివేదన, హారతి తదితరాలను జరిపారు. వెంకయ్యస్వామి నగరోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అన్నప్రసాదాన్ని దాదాపు ఐదు వేల మందికిపైగా భక్తులకు అందజేశారు. నారాయణదాసు, వటుకనాథస్వామి, గాలిపాళెం శ్రీహరిస్వామి తదితరులు ఉపన్యసించారు. మాకాని గోపీచంద్, శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షించారు.



నియామక ఉత్తర్వుల అందజేత

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగంలో మేస్త్రీగా విధులు నిర్వర్తిస్తూ సుబ్రహ్మణ్యం మృతి చెందడంతో ఆయన కుమారుడు భానుధర్‌కు కారుణ్య నియామకం ద్వారా అటెండర్‌గా విధులను కేటాయిస్తూ ఉత్తర్వులను కమిషనర్ నందన్ జారీ చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో తన చాంబర్‌లో నియామక ఉత్తర్వులను కమిషనర్ శుక్రవారం అందజేశారు. హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నరేంద్ర, మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.



ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



డీకేడబ్ల్యూ కళాశాలలో..



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రీడారంగం, దేశానికి ధ్యాన్‌చంద్ చేసిన సేవలను ప్రిన్సిపల్ గిరి కొనియాడారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు విజయకళ, అధ్యాపకులు రాంబాబు, రమాదేవి, అనిత, లలితకుమారి, గీత, స్వాతి, సుభాని తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(పొగతోట): నగరంలోని బాలిక సదన్‌లో బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ మాట్లాడారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు. జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, బాలిక సదన్ అధికారి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయంలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: పోక్సో కేసుల్లో బాధితులకు ఆర్థిక సాయాన్ని అందించడంలో నిర్లక్ష్యం తగదని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సమగ్ర శిశు సంరక్షణ పథకం అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల దత్తత విషయంలో నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. బాల కార్మిక నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బాల యాచకులను బడిలో చేర్పించాలని, దీనికి గానూ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీసీపీఓ సురేష్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, దిశ సీఐ సుబ్బారావు, సమగ్ర శిక్ష పీడీ వెంకటసుబ్బయ్య, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు శ్రీకాంత్‌కు అభినందన

నెల్లూరు(బృందావనం): థ్యాంక్ యూ డియర్ దర్శకుడు, నెల్లూరీయుడు తోట శ్రీకాంత్‌ను శుక్రవారం సత్కరించారు. పొగతోటలోని విజయశ్రీ బ్లడ్‌బ్యాంక్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు మనోహర్, పూసల లక్ష్మీమల్లేశ్వరరావు, పెద్దిశెట్టి కిరణ్, కృష్ణయ్య, శ్రీనివాసులు శ్రీమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గణనాథుడికి ప్రణమిల్లి..

నెల్లూరు(బృందావనం): ఫతేఖాన్‌పేట రైతుబజార్ సమీపంలోని అక్కన్నవారివీధిలో వినాయక చవితి ఉత్సవాలను గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడారు. వేడుకలను పదేళ్లుగా నిర్వహిస్తున్నామని వివరించారు. నిమజ్జనాన్ని ఆదివారం సాయంత్రం చేపట్టనున్నామని తెలిపారు.



